# 1916 - ఎ లవ్ స్టోరీ

**1916**

జనవరి మాసం... వసంత పంచమి.

అగస్త్యశాస్త్రి ఇల్లంతా శోకసముద్రమైంది.

శాస్త్రి గారయితే నిలువెల్లా వణికిపోతున్నారు... అతడి భార్య భ్రమరాంబికాదేవి మూర్ఛపోయింది.

అతడి తల్లి దీనంగా ఏడుస్తూ... 'ఈ అవమానం తట్టుకోలేనురా అగస్త్యా... నేను కాశీ వెళ్లిపోతాన్రా... ఎలాగూ తిరిగిరాను... నన్ను వెళ్ళనివ్వురా' అంటూ కొడుకుని వేడుకుంటోంది  కోడలికి సపర్యలు చేస్తూనే...

అప్పటికే పదిమందిదాకా కుల పెద్దలు వచ్చి కూచున్నారు. వాళ్ళు వస్తున్నకొద్దీ అగస్త్యుడు మరింత వణికిపోతున్నాడు.

"నువ్వు అప్రాచ్యుడివిరా... నీ కుటుంబం మూలాన మేం ఊరు విడిచి వెళ్లిపోవాలన్నంత బాధ కలుగుతోంది... అసలు నీ నిర్ణయమేంటో చెప్పు..." అన్నాడు లుబ్ధావధాని.

"ఒరేయ్.. నువ్వు గాయత్రీ ఉపాసకుడివి అన్న గౌరవం మంటగలిసిపోతోంది గదరా... ఊర్లో మన కుల ప్రతిష్ఠ మొత్తం నాశనమైపోతుంది. అలా బెల్లంకొట్టిన రాయిలా నిల్చుండకపోతే ప్రస్తుత కర్తవ్యమేంటో నీ నోటితోనే చెప్పు..." అన్నాడు మరో పెద్ద మనిషి రంగనాథశర్మ.

అగస్త్యుడు ఏం మాట్లాడలేదు.

అందరిమధ్యా అరగంట మౌనంగా గడిచింది.

సాంబ్రాణీ ధూపంతో ఎప్పుడూ పవిత్రమైన వాసన కలిగి ఉండే ఆ ఇల్లు... ఉదయ సాయంకాలాలు పూజలతో... గంటల శబ్దాలతో... ప్రతిధ్వనించే ఆ ఇల్లు... ఎనిమిది రకాల కూరలతో వెన్న, నెయ్యిలతో రోజూ కనీసం పదిమందికైనా ఘుమఘుమలతో ఆతిథ్యమిచ్చే ఇల్లు... ఒక్కసారిగా అంటరానిదైపోయింది.

కారణం... అగస్త్యుడి కొడుకు హరిహరనాథుడు ఓ అంటరాని అమ్మాయిని పెళ్లి చేసుకోవటమే...

విషయం తెలియగానే... భూకంపమొచ్చినంతగా కంపించిపోయింది ఆ కుటుంబం...

"మన వాకిలిలోంచి నడిస్తే నీళ్ళు చల్లుకుంటూపోయే ఆ అంటరాని వాడింటికి మన హరిహరుడు వాళ్ళ అమ్మాయిని పెళ్లి చేసుకుంటానని చెప్పడానికి వెళ్ళాడట్రా... ఎంతటి అపచారం... ఎంతటి తెగింపురా" అన్నాడు దత్తాద్రి పంతులు.

"మరో విషయం... ఆ అమ్మాయికి రెండు వందల రూపాయల కన్యాశుల్కం పోశాడట్రా... వాడికంత డబ్బు ఎక్కడిదీ.? పెళ్ళి చేసుకున్నాడట కూడా..." అన్నాడు మనోహరాచార్య.

"వాడు మాట్లాడే స్థితిలో ఉన్నాడని వాణ్ని ప్రశ్నలతో చంపేస్తున్నారా... వాడి కొడుకు చేసిందానికి వాడేం చేస్తాడు. కాకపోతే ఇదే ఊర్లో కాపురం పెడుతున్నాడంటే మనకెంత అవమానం. అందుకే వాడికి తగిన శాస్తి చెయ్యాలి... " అన్నాడు పురంధర స్వామి.

"అదేదో వాడి నోటితోనే చెప్పమనండి... అవున్రా... అగస్త్యా... నీ నిర్ణయమేంటో చెప్పు... లేదంటే... నీచేత్తో మీ ఇంట్లో అశుద్ధాన్ని చల్లించి... నిన్ను కుల బహిష్కరణ చెయ్యాల్సి ఉంటుంది. మొద్దులింగంలా నిలబడిపోయావ్... ఏదో ఒక నిర్ణయం ఇప్పుడే చెప్పేయ్ రా..." కఠినంగా అడిగాడు లుబ్ధావధాని.

స్పృహ కోల్పోయిన భ్రమరాంబికాదేవి... మెల్లగా కళ్లు తెరిచింది. జీవచ్ఛవమైపోయింది. కాలం మంచుముద్దలా మారింది...

అగస్త్యుడిలో కొంచెం చలనం... కళ్ళు నిప్పు కణికెల్లా మండుతున్నా కన్నీటి జలపాతాలయ్యాయి.

"రేపే... వాడికి... శాస్త్రోక్తంగా... పిండప్రదానం చేస్తాను..." అంటూ గంభీరంగా లోపలికెళ్లాడు. ఆ మాటతో అక్కడ కూచున్న పెద్ద మనుషులందరి మనసులూ శాంతించాయి.

కె.వి.నరేందర్

భ్రమరాంబిక గుండె అరనిమిషం పాటు ఆగిపోయి... మళ్లీ భారంగా కొట్టుకోసాగింది.

అగస్త్యుడి తల్లి "ఒరేయ్... నేను వాడి పిండ ప్రదానం చూళ్లేనురా.... నన్ను కాశీకి పంపించాక నీ ఇష్టం వచ్చినట్టు చేసుకో..." అంటూ ఏడుస్తోంది.

ఒక్కొక్కరు... నిశ్శబ్దంగా వెళ్లిపోతున్నారు.

❁ ❁ ❁

జొన్న చేను...

మంచె మీద పరిచిన వరి గడ్డిపై కొంచెం మంచులా పడుతున్న వెన్నెల వెలుగులో... మాలచ్చిమి ఒడిలో పడుకొని... తాదాత్మ్యంగా మాలచ్చిమి మొహాన్నే చూస్తున్నాడు హరిహరనాథుడు. ప్రపంచాన్ని మర్చిపోయి భార్య ముంగురులిని సవరిస్తున్నాడు.

మాలచ్చిమి మొహం వాడిపోయి ఉంది.

"మీవోల్లంతా నువ్వు సచ్చిపోయినట్టు వాగొడ్డుకు పందిర్లేసి పిండాలెట్టింద్రట... నన్ను చేసుకున్నందుకు నీకేం సుకముంటది... మా కులపోల్లను ఒప్పిచ్చుటానికి కన్యాసుల్కం పోస్తివి. గంత డబ్బు మావోల్లు ఎప్పుడు సూల్లె... కల్లు తాగి తాగి తందనాలాడ్తంద్రు. హరయ్యా... నీకు పిండాలెడ్తుంద్రంటే... ఎంత ఏడ్సిన్నో నీకేమెరుక..." అంది.

ఆ మాటలు హరిహరనాథుడికి విన్పించలేదు. మాలచ్చిమి కళ్ళలోంచి జారిపడ్డ నీటి చుక్కలు అతడి పెదాలపై పడటంతో... నవ్వి 'ఏడ్వకు' అన్నట్టు నిశ్శబ్దంగా కళ్ళు తుడిచాడు.

మాలచ్చిమి చేతిని తన చేతిలోకి తీసుకున్నాడు. "ఎందరు చెప్పినా వినకుండా మీ నానమ్మ... ఎడ్లబండి కిరాయి తీసుకొని కాశీకి పోయిందట. మీ అమ్మ సోయిదప్పిందట.... హరయ్యా... నేను నీ కంట పడకపోయినా మంచిగుంటుండే..." అంది బాధగా.

హరిహరనాథుడు ఆమె ఒళ్ళో అప్పటికే ప్రశాంతంగా నిద్రలోకి జారుకోవటం చూసి ఆమె కళ్ళు చెలిమలయ్యాయి... నిశ్శబ్దంగా హరిహరుడి నుదుటి మీద ముద్దెట్టుకుంది. ఎత్తయిన మంచె మీద వాళ్లిద్దర్నీ చూస్తూ... చంద్రుడు వెన్నెలధారని మరింతగా కుమ్మరించాడు.

❁ ❁ ❁

కాలభ్రమణంలో... హరిహరుడు, మాలచ్చిమిల ప్రేమ పెళ్ళి గురించి అగస్త్యుడికి ఎన్నెన్నో విన్పించాయి. నిమ్న కులం మీద ఏ విధంగా కసి తీర్చుకోవాలా అని అగ్రకులం ఎదురుచూస్తోంది. హరిహరుడు అదే గూడెంలో ఉండటం, ఓసారి ఒకడు బాగా తాగి

గూడెంలో హరిహరుడి మీద చేయి చేసుకున్నాడని తెలియటం లాంటి సంఘటనలు విన్నప్పుడల్లా ఆ అగ్రకులం ఆగ్రహంతో ఊగిపోయింది.

కొడుకుని చూడాలని భ్రమరాంబిక తపించినా... భర్త కంటి చూపునే తట్టుకోలేని ఆమె బలవంతంగా స్మరించుకోవడానిక్కూడా జడుసుకునేది.

అలాంటిది... ఆరోజు... ఆ ఇంటిని చేరిన ఓ వార్త ఇద్దర్నీ క్షణంపాటు విస్మయపరిచి...

నిమిషంపాటు ఆనందపరిచి... ఆ వెంటనే దిగులుగా... గుబులుగా మార్చేసింది.

'హరిహరుడు... తండ్రి కాబోతున్నాడని'

'మాలచ్చిమికి ఏడో నెలంట...' అని

భ్రమరాంబికాదేవి మౌనంగా ఏడుస్తుంటే... ఆమె మనసు మళ్లించాలని చెక్క ఊయలపై ఊగుతూ అన్నాడు అగస్త్యుడు.

"అమ్మ కాశీకి చేరుకుందంటావా... క్షేమంగా తిరిగొస్తుందంటావా?" అని.

భ్రమరాంబిక ఏడుపు ఆపలేదు. అగస్త్యుడు అసహనంగా ఊయల్లోంచి లేచి వెళ్ళిపోయాడు. కీస్‌కీస్‌మన్న ఊయల గొలుసుల శబ్దం ఆమె ఏడుపుతో శ్రుతి కలిపింది.

కాసేపటికి... ఏదో గుర్తొచ్చినదాన్లా లేచిన భ్రమరాంబిక వంటింట్లోకి వెళ్ళి ఆవు నెయ్యితో బెల్లం పాయసం వండింది. ఇత్తడి గిన్నెలో పోసి... మూతపెట్టి కొత్త చీరెలో కట్టి... పనిమనిషి భూదమ్మకిచ్చింది.

"మాలచ్చిమి కడుపుతో ఉందట... తొందరగా ఇచ్చి రావే" అని గబగబాగా వెళ్తోంటే... గుమ్మంలో ఎదురైన అగస్త్యుడ్ని చూసి గజగజా వణికిపోయింది భూదమ్మ. భ్రమరాంబికకు ముచ్చెమటలు పోశాయి.

"అయ్యా... పా...య...సం... అమ్మ... గారు..." భూదమ్మ గొంతు పెగలటం లేదు.

అగస్త్యుడు నిశ్శబ్దంగా.... ఏ భావమూ కన్పించనీయకుండా భార్యవైపు చూశాడు. భ్రమరాంబిక భయంతో తల దించుకుంది. అగస్త్యుడు మౌనంగా లోపలికెళ్లి పోయాడు. మౌనం అంగీకారమే అని భావించిన భ్రమరాంబిక 'తొందరగా వెళ్లవే' అని భూదమ్మని పంపించి గుండెల్నిండా ఊపిరి పీల్చుకుంది.

మరో రెండు నెలలు గడిచాయి.

"హరిహరుడికి తల్లి ఏవో ఫలహారాలు పంపిస్తోందట' అనే విషయం పొక్కి పెద్దలంతా వచ్చి అగస్త్యుడ్ని దూషించిపోయారు.

ఓ రోజు... ఉదయమే...

ఆ ఇంటిని ఓ దుర్వార్త చేరింది. కులస్థులంతా అది విని సంతోషించారు. అగస్త్యుడి గుండెలో బాధ కలిగింది. భ్రమరాంబిక బావురుమంది.

'నొప్పులు కష్టమై... మాలచ్చిమి చచ్చిపోయిందట'

'హరిహరుడు... గుండె పగిలేలా ఏడుస్తున్నాడట'

ఇంట్లో ఆ విషాదం... ఎవరికీ చెప్పుకోలేని గుండెకోతగా మారింది. పగతో రగిలిపోతున్న కులస్థులంతా గూడెం వైపు కదిలారు. కన్నప్రేమను ఆపుకోలేక అగస్త్యుడు భ్రమరాంబిక పరుగుపరుగున చేరుకున్నారు. గుంపులో నిల్చుండి... గుండెలవిసేలా ఏడుస్తున్న హరిహరుణ్ణి చూసి తట్టుకోలేకపోయారు.

"అంత్యక్రియలు మా ఆచారం ప్రకారం జరగాలి" ఊరందర్నీ ఉద్దేశించి చెప్పాడు సుబ్రహ్మణ్యశాస్త్రి. వాళ్ళ ఆచారమేంటో అర్థంగాని గూడెం ప్రజలు 'సరే' అన్నారు.

"మా ఆచారం ప్రకారం... నెలలు నిండిన గర్భవతి అయిన భార్య మరణిస్తే... భర్త ఆ పిండం బయటికి తీసి ఇరువురికీ దహనకాండ చెయ్యాలి" కర్కశంగా చెప్పాడు.

ఆ ఆచారం విని అంతా నోరు తెరిచారు. అయినా అలా చెయ్యాల్సిందే... కుల పెద్దలంతా పట్టుబట్టారు.

మాలచ్చిమి కడుపుని కత్తులతో చీల్చి... పిండాన్ని బయటికి తీయాలి. పిండం లోపలుండగానే దహనం చేయటం అపచారం... అరిష్టం... పొడుగాటి కత్తి తెచ్చి హరిహరుడి చేతికిచ్చారు. కాని హరిహరుడు అందుకు ఒప్పుకోలేదు... శాసించారు...

చివరికి... 'కన్నబిడ్డని చూసుకోవాలి' అనే ఒకే ఒక్క కోరికతో... హరిహరుడు విలవిల్లాడుతూ... వణుకుతున్న చేతులతో మాలచ్చిమి కడుపుని కత్తితో కోశాడు.

నెత్తుటి పిండాన్ని దోసిళ్ళతో పెకిలించాడు.

బిగ్గరగా రోదిస్తూ... పిండాన్ని బయటికి తీశాడు. పేగుబంధాన్ని కత్తిరించాడు.

ఆ దృశ్యం చూస్తూ... ఊరంతా శోకంతో దద్దరిల్లింది.

కులస్థుల కళ్ళల్లో పైశాచిక ఆనందం కళకళలాడింది... ప్రేమించినందున దానికీ... పెళ్లి చేసుకున్నందుకు వీడికి... తగిన శాస్తి అనుకున్నారు.

హరిహరుడు... దోసిలిలోని మగబిడ్డని కన్నీటితో కడిగేస్తూ... ముద్దాడాడు... అలాగే కుప్పకూలి పోయాడు... క్రమంగా శ్వాస ఆగిపోయింది...

అంతా నిశ్చేష్టులయ్యారు... హతాశులయ్యారు.

అగస్త్యుడు, భ్రమరాంబిక కొడుకు శవం మీద పడిపోయారు.... లుబ్ధావధాని వాళ్ళిద్దర్నీ ఓదారుస్తూ లేవదీశాడు. అప్పుడే...ఎవరో అరిచినట్టుగా చెప్పారు...

అదుగో... నెత్తుటి పిండంలో ఏదో చలనం... అందరి కళ్లూ ఆ బిడ్డ వైపు తిరిగాయి. ఏదో చిరు కదలిక... గాలికి రెపరెపలాడినట్టు.... కాళ్లల్లో... చేతుల్లో... గూడెంకి

చెందిన ఓ పెద్ద మనిషి.. బిడ్డని గిల్లాడు. 'వే...' గొంతు చిట్లించుకొని వచ్చిన ఏడ్పు...

ఆ అనూహ్య పరిణామానికి ... ఆశ్చర్యంతో ఏడవటం కూడా మర్చిపోయారంతా...

దూరంగా వున్న భ్రమరాంబిక... ఆ ఏడ్పు విని పరిగెత్తుకొచ్చింది.

బిడ్డని చేతుల్లోకి తీసుకొని గుండెలకు హత్తుకుంది. కులస్థులంతా మొహాలు చిట్లించారు.

అగస్త్యుడిలో కూడా ఏదో మనోనిబ్బరం... భార్య భుజం తట్టాడు అనునయంగా.... తన వాళ్ళ వైపు తిరిగి చేతులెత్తి మొక్కాడు.

"ఈ బిడ్డని పెంచుకోవడానికి మీరు అనుమతించరు... మీరు సహించరు... ఒకవేళ పెంచుకున్నా మీ పిల్లలతో కలిసి వీన్ని ఆడుకోనివ్వరు.... చదువుకోనివ్వరు... ఓ అంటరానివాడిగా మీరు చూపుల్తోనే చంపేస్తుంటే... వాడు అవమానంగా పెరగటం నాకిష్టం లేదు. అందుకే మా బిడ్డని తీసుకొని... ఈ ఊరు వదిలి వెళ్లిపోతున్నాం... మమ్మల్ని మన్నించండి..."

వాళ్లు కాలి నడకన ఊరు వదిలి వెళ్ళిపోతుంటే...

పొలిమేరదాకా సాగనంపింది గూడెం ప్రజలే !!

( ఒక ఆచారం గురించి విన్నాక...)

ముల్లంగి వెంకట రమణారెడ్డి
39-18-1, మాధవధార
విశాఖపట్నం-530 007
ఫోన్: 0891-2722189